క్లుప్తంగా...

అభివృద్ధి పనులపై జెడ్సీకి వినతి



కాప్రా: మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులపై స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్ బుధవారం డీసీ ముకుందరెడ్డితో కలిసి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజకు వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా ఫలహారం బండి ఊరేగింపు



భరత్‌నగర్‌లో ఫలహారం బండి ఊరేగింపులో బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: చర్లపల్లి డివిజన్ భరత్‌నగర్‌లో బుధవారం ఫలహారం బండి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. బోనాల పండగ అనంతరం నిర్వహించే ఈ ఫలహారం బండి ఊరేగింపులో బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. బీఎల్ఆర్ అభిమానులు, స్థానిక యువత పాల్గొన్నారు.

మిల్లెట్స్‌తో ఆరోగ్యం



ఈట్ మిల్లెట్స్–స్టే హెల్తీ కార్యక్రమంలో సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ శ్రీనివాసనగర్ కాలనీలో బుధవారం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈట్ మిల్లెట్స్–స్టే హెల్తీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం బి–బ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన మిల్లెట్స్ తిని హెల్తీగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు ఉప్పల్ మహంకాళి అమ్మవారి బోనాలు

ఉప్పల్: ఉప్పల్ పట్టణ ప్రజలు ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే మహంకాళి అమ్మవారి బోనాలను గురువారం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉదయం నుంచి ప్రారంభమయ్యే పూజలకు ప్రముఖులు, వీఐపీలు హాజరుకానున్నారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అల్వాల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీగా సయిదుద్దీన్



అల్వాల్: అల్వాల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారిగా సయ్యద్ సయిదుద్దీన్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అల్వాల్ సర్కిల్ పని చేస్తున్న విజయశ్రీ కార్వాన్ సర్కిల్‌కు బదిలీ కాగా కార్వాన్ సర్కిల్ నుంచి సయిదుద్దీన్ అల్వాల్ సర్కిల్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పట్టణ పురోగతికి అవసరమయ్యే చర్యలు తీసుకుంటామన్నారు. పౌర సేవలకు అందుబాటులో ఉంటూ జీహెచ్‌ఎంసీ నిబంధనల మేరకు భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేస్తామన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

గౌతంనగర్: డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ అన్నారు. బుధవారం న్యూమిర్జాల్‌గూడలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఏఈ దివ్యజ్యోతి, నాయకులు మేకల రాము యాదవ్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మోక్షమెప్పుడు..?



కుషాయిగూడ వీఎన్‌రెడ్డినగర్‌లో నిలిచిపోయిన వాహనాలు



పురోగతి లేని అభివృద్ధి పనులు

కాప్రా: అభివృద్ధి పనులు చేపట్టడంతో చర్లపల్లి డివిజన్ వీఎన్‌రెడ్డినగర్‌లో దారి మళ్లింపు స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. జమ్మిగడ్డతో పాటు చుట్టుపక్కల కాలనీవాసులు చర్లపల్లి, కుషాయిగూడ ఇండస్ట్రీయల్‌కు వెళ్లాలంటే వీఎన్‌రెడ్డి నగర్ మీదుగా ప్రయాణం సాగిస్తుంటారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఈ మార్గంలో వారి గమ్యస్థానాలకు చేరుకుంటారు. కానీ గత నెల రోజులుగా ఈ మార్గమధ్యలో పైప్‌లైన్ నిర్మాణంతో మరో కాలనీ నుంచి దారి మళ్లించారు. దీంతో మరింత ఇరుకైన కాలనీల్లో ప్రయాణించడంతో నిత్యం ఆయా కాలనీల్లో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో నెల రోజులుగా వాహనదారులు, స్థానికులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. నెల రోజులు కావొస్తున్నా ఇంత వరకు అభివృద్ధి పనుల్లో పురోగతి లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నిత్యం కార్యాలయాలు, స్కూళ్లకు సమయానికి చేరుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తి చేసి దారి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

త్వరగా పూర్తిచేయాలి



పైప్‌లైన్ పనులు చేపట్టి నెల రోజులు కావస్తున్నా.. పనులు మాత్రం ముందుకు సాగడంలేదు. దీని కారణంగా దారి మళ్లించి ఇరుకైన గల్లీల్లోంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. జమ్మిగడ్డ, చుట్టుపక్కల వాసులకు ఈ మార్గమే ప్రధాన రహదారి. ఉన్న దారిలో ఇలా నెల తరబడి పనులు ఆలస్యం చేస్తే ఎలా? ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్య ఏర్పడి స్కూల్ పిల్లలకు, ఉద్యోగులు, వ్యాపారస్తులకు అందరికీ ఆలస్యమవుతోంది. ఇప్పటికైనా రూట్ క్లియర్ చేసి సమస్యను పరిష్కరించాలి. - ఎస్‌ఏ రహీం, బీజేఆర్ కాలనీ అధ్యక్షుడు

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి



చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రామంతాపూర్: నాలుగున్నర ఏళ్లుగా ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు పూర్తిచేశామని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి అన్నారు. బుధవారం రామంతాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్, శారదానగర్, ఆర్టీసీ కాలనీ, ఎండోమెంట్ కాలనీ, ఓల్డ్ రామంతాపూర్, భరత్‌నగర్ కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ఆయన కార్యకర్తలు స్థానికులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని డీమార్ట్, ఇందిరానగర్ రోడ్డు, ఏడీఆర్‌ఎం ఆస్పత్రి నుంచి ఓల్డ్ రామంతాపూర్ రోడ్డు రాంశంకర్‌నగర్, భరత్‌నగర్ రోడ్ల పనులు వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ప్రారంభిస్తామన్నారు. రికార్డు స్థాయిలో పేద మధ్య తరగతి ప్రజలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పెన్షన్లతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్ కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేలా రికార్డు స్థాయిలో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. మిగిలిన అభివృద్ధి పనులను త్వరలోనే వేగవంతంగా చేపట్టి పూర్తిచేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నేతలతో పాటు స్థానిక బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘం నేతలు పాల్గొన్నారు.

యూజీడీ పనులకు ప్రణాళికలు సిద్ధం



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి

రామంతాపూర్: లోతట్టు ప్రాంతమైన ఇందిరానగర్‌లో బుధవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ పొంగుతున్న భూగర్భ డ్రైనేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ సమస్యలు ఏవీ లేకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇందిరానగర్ మెట్లగల్లి నుంచి మార్కండేయ స్వామి గుడి వరకు అతి వెడల్పు గల పైపులతో త్వరలో భూగర్భ డ్రైనేజీ పనులు చేపడతామన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ బస్తీల్లో కార్యాలయంలో వర్షానికి పొంగుతున్న మ్యాన్‌హోళ్ల వద్ద వెంటనే మరమ్మతులు చేపట్టి రోడ్లపై నీరు నిల్వకుండా చూడాలని ఆమె అధికారులను ఆదేశించారు. జలమండలి అధికారులు రవీందర్‌గౌడ్, కిషన్‌తో పాటు డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకటరావు, స్థానికులు పూస సత్తయ్య, బీఆర్ఎస్ నేత వెంకటాద్రి తదితరులు ఉన్నారు.

తక్షణమే సమస్యను పరిష్కరించాలి



చర్లపల్లి వీఎన్‌రెడ్డినగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కాప్రా: చర్లపల్లి డివిజన్ వీఎన్‌రెడ్డినగర్‌లో బుధవారం స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పర్యటించారు. ప్రస్తుతం ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. వరద నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది నెలకొనడంతో సంబంధిత అధికారులను పిలిపించి సమస్య పరిష్కారంపై చర్చించారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే త్వరితగతిన సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని అధికారులు వివరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, స్థానికులు వాసుదేవరెడ్డి, రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, రమేష్‌చౌదరి, వరప్రసాద్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలి



హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ పరిధిలోని నవరంగ్‌గూడ, కామాక్షిపురంలో బుధవారం బీజేపీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ సెక్రటరీ, కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్ పర్యటించారు. వర్షాల వల్ల ఏర్పడిన గుంతలను, రోడ్డును పరిశీలించి రోడ్డు ప్యాచ్ వర్క్, కమ్యూనిటీహాల్ రిపేర్ పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆమె అధికారులకు తెలిపారు. డీఈ నాగమణి, జలమండలి ఏఈ రవీందర్, కిషన్, నాయకులు చెల్లోజు ఎల్లాచారి, రంగమ్మ, హరిబాబు, రవి, రఘుగౌడ్, స్థానికులు కై సర్, అబ్బు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ రోడ్డుపై గుంతలు పూడ్చాలి



ఉప్పల్: ఉప్పల్– వరంగల్ జాతీయ రహదారిపై నిలిచిన వరద నీటితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కాలువ తవ్వించి రోడ్డుపై నిలిచిన వరద నీటిని తొలగింపజేశారు. రోడ్డుపై పడిన గుంతలను పూడ్చి వాహనదారులకు అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు. ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసరావు, ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, జీహెచ్‌ఎంసీ అధికారులు తదితరులు ఉన్నారు.

శ్రీవిజయ గణపతి లారీ అసోషియేషన్ నూతన కార్యవర్గం



అల్వాల్: అల్వాల్ శ్రీవిజయ గణపతి లారీ అసోషియేషన్ నూతన కార్యవర్గం బుధవారం ఏర్పడింది. అధ్యక్షుడిగా కే.ప్రకాష్‌బాబుగౌడ్, ఉపాధ్యక్షులుగా ఎస్.బాలవసంత్‌రెడ్డి, జి.సత్యనారాయణరావు, వై.నర్సింగ్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, పల్నాటి నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా పి.రాజేష్‌గౌడ్(కన్నా), కోశాధికారిగా వై.బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జైసింహ, కె. శ్రీహర్ష, నవీన్, వీరేంద్ర, హరినాయక్, రాములు, కార్యనిర్వాహక సభ్యులుగా అజయ్, అశోక్‌గౌడ్ నియమితులయ్యారు.

బ్లూక్రాస్ సొసైటీకి సహకారం అందించాలి

బోడుప్పల్: వీధి కుక్కలకు బర్త్ కంట్రోల్ కార్యక్రమం, వ్యాక్సినేషన్ స్టెరిలైజేషన్‌కు అవసరమైన చర్యలకు ప్రముఖ జంతు సంక్షేమ సంస్థ బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్‌తో అవగాహన ఒప్పందం చేసుకోవడం జరిగిందని బోడుప్పల్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. నగర పాలక సంస్థ ప్రజలు బ్లూక్రాస్ సొసైటీకి సహాయ సహకారాలు అందించాలని కమిషనర్ కోరారు. వీధి కుక్కల సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్ 040–27215959 సంప్రదించాలన్నారు.

పెన్షన్ల సమస్యను పరిష్కరించాలి



కాప్రా సర్కిల్ ఇన్‌చార్జి డీసీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్

కాప్రా: డివిజన్ పరిధిలోని సాయిరాంనగర్, సాయిబాబానగర్, ఇందిరానగర్ కాలనీల్లో పెన్షన్ల సమస్య నెలకొందని, తక్షణమే వాటిపై దృష్టి సారించాలని కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అన్నారు. ఇదే విషయంపై బుధవారం కాప్రా సర్కిల్ కార్యాలయంలో ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ ముకుందారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఆయా కాలనీల్లో అర్హులైన పేదలు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న రసీదులను సేకరించామని తెలిపారు. పెన్షన్ల దరఖాస్తులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో వాటిపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ డీసీని కోరారు. ఈ విషయంపై స్పందించిన డిప్యూటీ కమిషనర్ పెన్షన్ల పెండింగ్‌పై సంబంధిత ప్రాజెక్టు అధికారితో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.

మాజీ సైనికులకు అండగా ఉంటా

మాజీ డీజీపీ గోపినాథ్‌రెడ్డి



అల్వాల్: మాజీ సైనికులకు అండగా ఉంటానని జైళ్లశాఖలో మాజీ డీజీపీ గోపినాథ్ రెడ్డి అన్నారు. కార్గిల్ విజయ దినోత్సవాన్ని పురస్కరించుకొని వాయుపురిలో మాజీ సైనికులు గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్గిల్ యుద్ధంలో కొందరు సైనికులు వీరమరణం పొందారని, వారి కుటుంబాలకు దేశం రుణపడి ఉంటుందన్నారు. మాజీ మేజర్ జనరల్ ఎన్.శ్రీనివాసరావు, విశ్రాంత కమాండర్ డీజీ రెడ్డి, కర్నల్ ఎస్.శ్రీనివాసులు ఉన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

అల్వాల్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న అల్వాల్‌కు చెందిన బి.ఆంథోనికి నిజాం ఆసుపత్రిలో వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం మంజూరు పత్రాన్ని అల్వాల్ బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఆంథోని కుటుంబ సభ్యులకు అందజేశారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆంథోనిని స్వయంగా పరామర్శించారు. చికిత్స నిమిత్తం అవసరమయ్యే సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు మంజూరు పత్రాన్ని అందజేసినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

కాప్రా: వికలాంగుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు కుషాయిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ చంద్రకాంత్ తెలిపారు. బుధవారం ఆయన ఓ ప్రకటన ద్వారా తెలుపుతూ.. ఈ నెల 28న అంబేడ్కర్‌నగర్ బస్టాప్‌లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటలకు బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కుషాయిగూడ, నాగారం, దమ్మాయిగూడ, అంబేడ్కర్‌నగర్, బాలాజీనగర్, బీజేఆర్‌నగర్, జైజవాన్ కాలనీ ప్రాంతవాసులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదరన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్‌ఫొటోతో పాటు రూ.50 రుసుము చెల్లించి బస్‌పాస్ పొందాలని తెలిపారు.

స్కూల్ తెరవడంపై ఆగ్రహం

మల్లాపూర్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యా సంస్థలకు రెండు రోజులు సెలవు దినాలు ప్రకటించినప్పటికీ మల్లాపూర్‌లోని ముద్రా కాన్సెప్ట్ స్కూల్‌కు మాత్రం సెలవు ఇవ్వకుండా పాఠశాలలో తరగతులు నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థులతో పాఠశాల తెరిచి క్లాసులు నడిపిస్తున్నారని అడగడంతో బరాబర్ తెరిచే ఉంచుతాం అని ప్రిన్సిపాల్ వాగ్వాదానికి దిగారు. విద్యార్థుల ఆందోళనతో మధ్యాహ్నం విద్యార్థులను ఇంటికి పంపించారు. ఏఐఎస్‌ఎఫ్ ఉప్పల్ మండల అధ్యక్షులు అజీమ్‌పాషా, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు రవి, కిరణ్, నదీమ్ తదితరులు ఉన్నారు.

శిథిల భవనాలను కూల్చేస్తున్నాం

అల్వాల్: శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చేస్తున్నామని అల్వాల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారి సయిదుద్దీన్ అన్నారు. శిథిల భవనాలను కూల్చివేయాల్సిందిగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం సర్కిల్ పరిధిలోని కుమ్మరిబస్తీలో పురాతన భవనాన్ని జేసీబీతో కూల్చివేశారు. సుమారు 40 వరకు పురాతన భవనాలు ఉన్నాయని, సంబంధిత యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. త్వరలో కూల్చేస్తామన్నారు.



ఆలయ పునర్‌నిర్మాణం కోసం విరాళాలు



విరాళాలు అందజేస్తున్న కార్పొరేటర్లు

బోడుప్పల్: దాసాంజనేయ దేవాలయం పునర్నిర్మాణం కోసం కార్పొరేటర్లు బుధవారం మేయర్ బుచ్చిరెడ్డికి విరాళాలు అందజేశారు. 18వ డివిజన్ కార్పొరేటర్ పులకండ్ల హేమలతా జంగారెడ్డి రూ.20,116, 14వ డివిజన్ కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.10,116 అందజేశారు. మేయర్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ఆలయ పునర్‌నిర్మాణం కోసం పెద్ద ఎత్తున విరాళాలు అందజేయాలని సూచించారు.

విశ్రాంత రైల్వే ఉద్యోగి అదృశ్యం



శివశంకర్ (ఫైల్)

మల్కాజిగిరి: విశ్రాంత రైల్వే ఉద్యోగి అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సతీష్ వివరాల ప్రకారం.. ఈస్ట్ ఆనంద్‌బాగ్‌కు చెందిన శివశంకర్(65) విశ్రాంత రైల్వే ఉద్యోగి. బ్రెయిన్ సర్జరీ అయిన తర్వాత ఆయన మానసిక స్థితి సరిగాలేదు. ఈ నెల 15వ తేదీ ఇంటి నుంచి బయటకు వెళ్లిన శివశంకర్ తిరిగి రాలేదు. ఈ ఘటనపై బుధవారం అతడి కొడుకు మనీష్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మణిపూర్‌లో శాంతి భద్రతలు కాపాడాలి

మల్కాజిగిరి: మణిపూర్ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం, సీపీఐ నాయకులు కృపాసాగర్, నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం మల్కాజిగిరి చౌరస్తాలో మణిపూర్ అల్లర్లపై నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం వ్యవహారం మద్దతు పలికే విధంగా ఉండటం సిగ్గుచేటన్నారు. నర్సింగ్‌రావు, లక్ష్మణ్, మంగ, నజీమా, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామంతాపూర్ చౌరస్తాలో..

రామంతాపూర్: మణిపూర్‌లో శాంతి భద్రతలను కాపాడాలని బుధవారం రామంతాపూర్ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఆందోళనలో 150 మంది చనిపోయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉన్నాయన్నారు. ఐద్వా మహిళా సంఘం నేతలు వినోద, పల్లవి, సీపీఎం నేతలు ఎర్రం శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, కృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

బోడుప్పల్: బోడుప్పల్ ప్రధాన రహదారిలో స్కూల్ సమయంలో సిద్ధార్థ స్కూల్‌కు వచ్చే వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని 18వ డివిజన్ కార్పొరేటర్ పులకండ్ల హేమలతారెడ్డి బుధవారం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. సదరు స్కూల్ ట్రాఫిక్ నిలిచిపోయి, ఆఫీసులకు, బయటకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. స్కూల్ వద్ద ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద ట్రాఫిక్ సెంటర్ వద్ద వాహనాదారులు అక్రమ పార్కింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వినతి పత్రంలో కోరారు.